
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025







ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జి.శ్రీనివాస్

12వ పీఆర్సీ వెంటనే వేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

భీమవరం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిలను, 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇప్పటికే ఆలస్యమై ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయారని, 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్టీయూ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏఆర్‌కెఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే బదిలీలు, పదోన్నతులు పూర్తయినందున ఇంకను ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ అభ్యర్థులు వచ్చేవరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి పాఠశాల విద్యాబోధనకు ఆటంకం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 2008, 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల వయో పరిమితికి పెంచాలని వారిని రెగ్యులర్ విధానంలో నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.



పురపాలకానికే పన్ను వ్యవహారం..

తిరిగి పంపిన ప్రభుత్వం

నేడు పాటకు మునిసిపాలిటీ సన్నాహాలు

నరసాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పన్ను వసూళ్లపై ప్రభుత్వం నిర్ణయాన్ని పురపాలక సంఘానికే అప్పగించింది. కౌన్సిల్‌తో చర్చించి పాటను నిర్ణయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో సోమవారం పాట నిర్వహించేందుకు అధికారులు మరోసారి ఏర్పాట్లను రెడీ చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను మార్కెట్ పన్ను వసూళ్ల పాట ప్రారంభ ధరను పురపాలక సంఘం రూ.73 లక్షలుగా నిర్ణయించింది. ఆరుసార్లు పాట పెట్టారు. అయితే ఎవరూ ముందుకు రాలేదు. చివరికి రూ.53 లక్షలకు భూపతి సురేష్ పాడుకున్నాడు. దీన్ని కౌన్సిల్ ఆమోదం చేయలేదు. ప్రభుత్వ నిర్ణయానికే పంపింది. మూడు నెలల తరువాత ప్రభుత్వం నుంచి తిరిగి మునిసిపల్ కోర్టుకే వచ్చింది. మీరే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇప్పటి వరకు పన్ను వసూళ్ళను మునిసిపల్, సచివాలయ సిబ్బందే చేపట్టారు. దీనివల్ల సిబ్బంది విధులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆశించిన స్థాయిలో పన్ను వసూళ్లు కూడా జరగలేదు. పురపాలకం మళ్లీ పాత ప్రారంభ ధర నుంచే మార్కెట్ పాటను పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఆర్థిక సంవత్సరంలో మూడు నెలలు గడిచిపోయింది. దీంతో మిగిలిన తొమ్మిది నెలలకు పాటను పెట్టి జూలై 1 నుంచి పాటదారుడికి మార్కెట్ పన్ను వసూళ్ల బాధ్యతలను అప్పగించాలని యోచనలో ఉన్నారు. ప్రారంభ ధరను రూ.54 లక్షలుగా నిర్ణయించి సోమవారం పాట పెట్టనున్నారు.

గంజాయ్!

- అవగాహన కల్పిస్తున్నా తగ్గని సరఫరా
- ఈగిల్ టీమ్ ఉన్నా అంతంతమాత్రమే..



ఎంఈవోల వ్యవస్థలో 'ఇద్దరి' అవస్థలు!

7



సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల..పక్కన డీసీసీ అధ్యక్షుడు హరికుమార్ రాజు, మాజీ మంత్రి బాపిరాజు

పార్టీని బలోపేతం చేయండి

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

మండల, గ్రామస్థాయిల్లో కమిటీలు వేయండి

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

భీమవరం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ నాయకత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా భీమవరంలోని ఆనందా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం ఎలా చెయ్యాలి ? నాయకత్వంపైనా సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుడు అందరికి కలుపుకుని ముందుకు సాగాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని పట్టణ, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. ప్రజా సమస్యలపై పోరాటం చెయ్యాలి. ప్రజల పక్షాన పోరాడాలని అన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అవసరం ఎంతో ఉందన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చెయ్యలేకపోయిందని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తే ఒక్కరూ ప్రశ్నించడం లేదన్నారు. విభజన హామీలను అమలు చేసే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరికుమార్‌రాజు, కేబీఆర్ నాయుడు, ఏడు నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పట్టణాల్లో భవన నిర్మాణాలకు అనుమతుల మంజూరులో ప్రభుత్వం నిబంధనలను సడలిం చింది. కొద్దిపాటి స్థలంలోనూ ఇళ్లు నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. సెట్ బ్యాక్‌లోనూ ప్రభుత్వం సడలింపులు ఇవ్వడంతో పట్టణాల్లో ఇప్పటివరకు స్తబ్దుగా ఉన్న నిర్మాణ రంగానికి మంచి ఊపు వస్తుందని భావిస్తున్నారు.



నిర్మాణ రంగం జోష్

పట్టణాల్లో నిర్మాణాలకు ఊతం

నిబంధనలు సడలించిన ప్రభుత్వం

లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లకు ఉపశమనం

నాలుగు నెలల సమ్మెకు స్వస్తి

భీమవరం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణాలకు అనుమతులపై నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఫలితంగా అంతా ఊపిరి పీల్చుకున్నారు. బిల్డర్‌లలోనూ జోష్ నెలకొంది. గతంలో నిర్మాణం చేసుకోవాలంటే రోడ్లు వెడల్పుగా ఉండాలి. చిన్న స్థలాల్లో ప్లాన్‌లు రావడానికి ఇబ్బంది అయ్యేది. అనుమతులు తెచ్చుకున్న తర్వాత నిబంధనలను అతిక్రమించేవారు. తమకు అనుకూలంగా ఇంటిని నిర్మించుకునేవారు. ప్లాన్‌లు మంజూరు చేసే అధికారం పట్టణ ప్రణాళిక అధికారులకు ఉండేది. ఇటీవల లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్ (ఎల్‌టీపీ)లకు అవకాశం ఇచ్చింది. అయితే నిర్మాణదారులు నిబంధనలను అతిక్రమిస్తే ఎల్‌టీపీలపై క్రిమినల్ చర్యలుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దాంతో గత కొన్నాళ్లుగా ఎల్‌టీపీలు ప్లాన్‌లు పెట్టడం లేదు. సమ్మెలో ఉన్నారు. ఫలితంగా కొత్త నిర్మాణాలు నిలచి పోయాయి. నేరుగా మున్సిపాలిటీలకు సంప్రదిస్తే అతిక్రమణలు ఉండకూడదని స్పష్టం చేశారు. దాంతో నిర్మాణదారులు వెనుకంజ వేశారు.

నిర్మాణ రంగానికి ఊపు

ఇప్పటిదాకా 30 అడుగుల రహదారి ఉంటే ఇంటి నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేసేవారు. తక్కువ రహదారి ఉన్నట్టయితే సొంత స్థలంలో మున్సిపా లిటీకి రిజిస్ట్రేషన్ ఇచ్చేవారు. మొత్తంపైన 30 అడుగులకు సరిపడా రహదారి ఉన్నట్టు మున్సిపాలిటీలో నమోదయ్యేది. మున్సిపాలిటీకి ఇచ్చిన స్థలంలో సెట్ బ్యాక్ , లేదంటే నిర్మాణాలు చేపట్టేవారు. రహదారి వెడల్పు చేయాలనుకుంటే నిర్మాణాలను కూడా పడగొట్టే అధికారం మున్సిపాలిటీకి ఉంటుంది. అయినా స్థల యజమానులు కష్ట, నష్టాలను అంచనా వేసుకునే మున్సిపాలిటీ రహదారికి సరిపడా జాగాను రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చేది. ఇటీవల అతిక్రమణలకు పాల్పడితే ఎల్‌టీపీలపై చర్యలుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దాంతో ఎల్‌టీపీలు ప్లాన్‌లు పెట్టడం లేదు. అంతా సమ్మెలో ఉన్నారు. నిబంధనలపై వెసులుబాటు కల్పించవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు ఆరు అడుగులు రోడ్డు ఉన్న స్థలాల్లో కూడా ఇళ్ళ నిర్మాణానికి అనుమతి ఇస్తారు. ఇది సామాన్యులకు ఎంతో ఉపయోగపడుతుంది. సెట్ బ్యాక్‌ల విషయంలో గతంలో ఇచ్చిన జీవో కారణంగా పట్టణాల్లో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయాయి. సెట్ బ్యాక్‌లోనూ - 8లో

సిఫార్సుకే ప్రాధాన్యం

- కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్
- పారదర్శకత లోపించిందని ఉద్యోగుల ఆవేదన



ఏలూరుసిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండో రోజు ఏలూరులోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రధానంగా సిఫార్సు ఉంటేనే బదిలీ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. బదిలీ ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, ఎమ్మెల్యేల సిఫార్సు పత్రాలు ఉంటేనే బదిలీలు చేస్తున్నారని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే విమర్శించడం గమనార్హం. ముఖ్యంగా ఆప్షన్ ఫారాలపై మూడు ఆప్షన్లు కోరుకోమని చెబుతున్నారని, అసలు ఖాళీలు జాబితా ప్రకటించకుండా ఏ విధంగా కోరుకోవాలని పలువురు సచివాలయ ఉద్యోగులు ప్రశ్నించారు. సిఫార్సు పత్రాలు ఉన్నవారినే పరిగణలోకి తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. అసలు ఏ సిఫార్సు పత్రాలు లేకుంటే బదిలీలు చేయరా..? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు స్పౌజ్ కోటా ఉన్నా సిఫార్సు లేఖ ఉంటేనే ఉద్యోగులు ఎంపిక చేసుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తామని సంబంధిత అధికారులే చెబుతుండడంతో ఉద్యోగులు ఏం చేయాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సచివాయాల హేతుబద్ధీకరణనేపథ్యంలో కొన్ని చోట్ల ఇంజనీరింగ్ పోస్టులకు అవకాశం లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. కాగా సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఒక ప్రహసనంలా మారిందని, రాజకీయ పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. ఆదివారం ఇంకా పలు శాఖలకు చెందిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ జరిగింది.

సార్..అన్యాయం చేయొద్దు..

ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ల నిరసన

ఏలూరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో సోషల్ వెల్ఫేర్ జేడీ నిబంధనలు పాటించడం లేదని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఏలూరు బాలయోగి సైన్స్ పార్క్ వద్ద సంఘం ఆధ్వర్యంలో పలువురు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ జేడీ వై.విశ్వమోహన్ రెడ్డి కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు చేసిన వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

తట్టా బుట్టా సర్దుకుని..

వరద భయంతో పునరావాస కాలనీలకు



వేలేరుపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గతంలో వరదల సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాల నేపథ్యంలో ముంపు మండలాల్లోని ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. జూలై వస్తుందంటేనే ముంపు మండలాల ప్రజల గుండెల్లో గుబులు ప్రారంభమవుతుంది.ఏటా గోదావరి వరదల కారణంగా ఈ ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల సమయంలోనే గ్రామాల్లోని ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు అప్పటికప్పుడు తరలిపోవాలంటే అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోని సామాన్లు పూర్తిగా తరలించే సమయం కూడా ఉండదు.

మూడేళ్లుగా ఎంతో నష్టం

ఈ ప్రాంత ప్రజలు మూడేళ్లుగా వరదల కారణంగా ఎంతో నష్టపోయారు. 2022 జూలై లో వచ్చిన భారీ వరదల కారణంగా గ్రామాలకు గ్రామాలే నీటమునగా తీవ్ర ఆస్తి, పశు నష్టం సంభవించింది. ఆయా గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వచ్చింది. గతేడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలల పాటు గోదావరి వరదలు, పెదవాగు బీభత్సం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలా గత చేదు అనుభవాల నేపథ్యంలో ప్రజలు ఈ ఏడాది ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇళ్ల ప్యాకేజీలు జమ అయినవారు తమకు కేటాయించిన పునరావాస కాలనీలకు తరలిపోతుండగా ప్యాకేజీ అందని వారు సొంత భూములు ఉండి వ్యవసాయం చేసుకునేవారు మండలంలోని శివకాశీపురం, భూదేవిపేట, బండలబోరు, తదితర గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని ఈ మూడు నెలల పాటు ఆశ్రయం పొందేందుకు వీలుగా తమ ఇళ్లలోని సామగ్రిని తరలిస్తున్నారు.

గుట్టల మీద గుడిసెలు

గోదావరి వరదకారణంగా దారులు మూసుకుపోయే ప్రమాదం ఉన్న రుద్రమ్మకోట, రేపాక గొమ్ము, తాటుకూరు గొమ్ము, తిరుమలాపురం, నాళ్లవరం, చిగురుమామిడి గ్రామాల ప్రజలు కొన్ని రోజులుగా తమవస్తు సామగ్రితో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలి పోతుండగా రుద్ర మ్మకోట, మట్టిగట్ల, చిగురు మామిడి, కోయిదా గ్రామాల ప్రజలు సమీపం లోని గుట్టల మీద గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రానున్న మూడునెలలపాటు వీరికి కొండగుట్టలే ఆవాసం. రేపాకగొమ్ము గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు ఆదివారం పునరావాస కాలనీలకు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తమ ఇళ్లలోని సామగ్రిని తరలించారు. ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలు గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలి వెళ్లాలంటూ నెల రోజుల నుంచి రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు ఒత్తిడి తెస్తున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు , తదితరులు

మ్యాపింగ్ యాప్‌లో మార్పులు చేయండి

భీమవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాల కోసం అమలు చేస్తున్న మ్యాపింగ్ యాప్‌లో మార్పులు, చేర్పులు చేయాలని టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. రాష్ట్ర పార్టీ సమీక్షా సమావేశాల్లో భాగంగా రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఇతర నాయకులు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిశారు. గతంలో రూపకల్పన చేసిన మ్యాపింగ్ యాప్‌ను పూర్తిగా మార్చివేయాలని, కొత్త యాప్‌ను తేవాలని కోరారు. ప్రభుత్వ విధానాన్ని జూలై రెండో తేదీ నుంచి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ప్రత్యర్థి పార్టీల నుంచి విమర్శలకు తావులేకుండా మన విధానాన్ని ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు.



స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయలు

పెంటపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల ధరలు స్వల్పంగా పెరగాయి. గతవారం కంటే ఈ వారం కూరగాయల ధర రూ.10 నుంచి 20 వరకు పెరిగాయి. కొన్ని కూరగాలయల ధరలు మాత్రమే నిలకడగా కొనసాగాయి. బెండకాయలు గతవారం కేజీ రూ.40 ఉంటే ఈవారం రూ.50లకు చేరాయి. ఇవే బెండకాయలు గ్రామాల్లో రూ.60 వరకు అమ్మకాలు జరిగాయి. గత వారం మాదిరిగా ఉల్లి పాయలు రకాన్ని బట్టి 4 కేజీలు రూ.100, 5 కేజీలు రూ. 100 విక్రయాలు సాగాయి. ఉల్లిపాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం మార్కెట్‌లో ధరలు ఇలా.. కేజీ టమాటా రూ.30, బీరకాయలు కేజీ రూ.50, దొండకాయలు రూ.40, బెండకాయలు రూ.50, తెల్లవంకాయిలు కేజీ రూ.60చ నల్ల వంకాయిలు కేజీ రూ.50, అల్లం కేజీ రూ.60, మునగకాయలు 3 రూ.20, అనపకాయ రూ.15, దోసకాయలు రూ.20, అరటికాయలు 3 రూ.20, క్యాబేజి రూ.30 , బీట్‌రూట్ కేజీ రూ.50, బీన్సీస్ కేజీ రూ.80, కాప్సికం రూ.70, పచ్చి మిరపకాయలు కేజీ రూ.40 విక్రయాలు సాగాయి.



గంజాయ్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పెరుగుతున్న వినియోగం

» అవగాహన కల్పిస్తున్నా తగ్గని సరఫరా » ఈగిల్ టీమ్ ఉన్నా అంతంతమాత్రమే..

తాడేపల్లిగూడెంకు చెందిన ఓ వైద్యుడు ఏడాది క్రితం డ్రగ్స్‌కు బానిసై మునిగితేలాడు. ఒక సమయంలో డ్రగ్స్ అందుబాటులో లేకపోవడంతో సమీపంలోని మందుల షాపునకు వెళ్లి మత్తు ఇచ్చే దగ్గు అరుకుని ఇవ్వమని కోరాడు. దానికి యజమాని నిరాకరించడంతో అతడిపై దాడి చేశాడు. అతడి చేయి కూడా విరిగింది.

భీమవరం పట్టణానికి చెందిన నలుగురు యువకులు కొన్నాళ్ల క్రితం గంజాయి మత్తులో ఉండి కొందరిపై దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే గంజాయి మత్తులో ఉన్నట్టుగా తేలింది.

ఆకివీడుకు చెందిన కొందరు యువకులు గంజాయి మత్తుకు అలవాటు పడి నిత్యం ఒక ప్రదేశంలో గంజాయి సేవించేవారు. దానిని అక్కడున్న స్థానికులు ఖండించడంతో వారిపై దాడికి దిగారు.

గంజాయి వ్యాపారం అంతటా విస్తరించింది. ముఖ్యంగా రైల్వే లైన్, జాతీయ రహదారులే లక్ష్యంగా ముఠాలు రెచ్చిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చిన్నపాటి కళాశాలల నుంచి ఇంజనీరింగ్ కళాశాలల వరకు గంజాయి విస్తరించిందనడంలో సందేహం లేదు. గతంలో గంజాయి మూలాలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో క్రయ విక్రయాలు రెట్టింపయ్యాయి. గంజాయి ఎంత విస్తరించిందంటే ఓ ఆటో డ్రైవర్ ఇంటి ముందు గంజాయి మొక్కలు పెంచేంతలా పాకింది. వాటి నిర్మూలనకు పోలీస్‌శాఖ ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారని ప్రత్యేకంగా మూడు నెలల క్రితం ఈగిల్ టీంను ప్రారంభించారు. ఈ టీం రానున్న రోజుల్లో గంజాయి మత్తును ఏవిధంగా వదిలిస్తారో చూడాల్సి ఉంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

భీమవరం క్రైం/తాడేపల్లిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, ప్రముఖ విద్యా సంస్థల వద్ద కాపు కాసిన కొన్ని ముఠాలు విద్యార్థులను గంజాయి ఉచ్చులోకి లాగుతూ వారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. ఎక్కువగా సిగరెట్లు కాల్చే విద్యార్థులకు గంజాయిని ఎలా వినియోగించాలో చూపించి వారిని ఆ మత్తులోకి వెళ్లేలా వల వేస్తున్నారు. రెండు, మూడుసార్లు అలవాటు చేసుకున్న విద్యార్థులు దాని కోసం ఎన్ని రూపాయలైనా ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారు. ఈవిధంగా చదువును పక్కన పెడుతున్నారు. తద్వారా చాలామంది యువత చదువుతో వెనకబడి అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల కాలంలో వస్తున్న క్రికెట్ మ్యాచ్‌లు వంటి వాటికి పందేలు కాసి ఆ పందేల్లో వచ్చే సొమ్మును గంజాయి, డ్రగ్స్‌కు వినియోగిస్తూ ఊబిలోకి కూరుకుపోతున్నారు. దీనిపై ఎన్నో రకాలుగా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలామందిలో మార్పు కనబడటం లేదు. ఈ కోవలోనే భీమవరం పట్టణానికి చెందిన ఒక యువకుడు నైజీరియా నుంచి భీమవరానికి ఆన్‌లైన్‌లో డ్రగ్స్ బుక్ చేయడంతో చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అవి కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డాయి. దీంతో రెస్ట్‌హౌస్ రోడ్డుకు చెందిన యువకుడిని అక్కడి పోలీసులు వచ్చి అరెస్ట్ చేశారు. దీనిలో భాగంగా విచారణలో ఆ యువకుడు డ్రగ్స్‌ను తీసుకువచ్చి ఇక్కడ ఉన్న విద్యార్థులకు, యువతకు విక్రయిస్తున్నట్లుగా తేలింది. అప్పట్లో ఈ విషయం సంచలనమైంది.

నైజీరియన్‌కు చెందిన ఒక వ్యక్తి ఈ ప్రాంతానికి వచ్చి డ్రగ్స్ వినియోగిస్తుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు అతడిని అరెస్ట్ చేసి నైజీరియా పోలీసులకు అప్పగించారు. నాలుగేళ్ళ క్రితం భారీ స్థాయిలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలిస్తుండగా స్థానిక పోలీసులు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ లో దానిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంచుమించుగా ఆ గంజాయి టన్ను వరకు ఉండవచ్చని అప్పట్లో పోలీసులు తెలిపారు. నలుగురు యువకులను కూడా అరెస్ట్ చేశారు. ఇటీవల ఉండి శివారు ఉప్పుగుంట ప్రాంతంలో కొంతమంది యువకులు గంజాయి తీసుకువచ్చి విక్రయాలు చేస్తుండగా ఉండి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. దీనిలో ఒక హెడ్ కానిస్టేబుల్ వారి వద్ద డబ్బులు తీసుకున్నట్లుగా ఆరోపణలు రావడంతో అతడిని బదిలీ చేశారు.

ఈగిల్ టీమ్‌కు చిక్కింది ఇదే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈగిల్ టీం పర్యవేక్షణ చేస్తోంది. ఈ బృందం ద్వారా ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో ఐదు కేసుల్లో 416 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.16 లక్షలు ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు కేసుల్లో రెండు కేజీల గంజాయి పట్టుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 12 కేసుల్లో రూ.78 లక్షల విలువ చేసే రెండు వేల కేజీల గంజాయి సీజ్ చేశారు. గంజాయి కేసులు ఏజెన్సీ ప్రాంతాలతో పాటు రైల్వే, జాతీయ రహదారిలకు ఆనుకుని గంజాయి సరఫరా గుట్టుగా సాగుతుందని పోలీస్‌శాఖ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయిని అరికడుతున్నాం



గంజాయిని అరికట్టేందుకు ఎన్నో రకాలుగా కృషి చేస్తున్నాం. ప్రత్యేకించి అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాకో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయాలు జరిగినా, వినియోగించినా చర్యలు తీసుకుంటుంది. కాలేజీలు, పాఠశాలల్లోను గంజాయి వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాం.

- ఆర్ఎస్ కుమరేశ్వరన్, ఎక్సైజ్ శాఖ అధికారి, పశ్చిమ జిల్లా

మత్తు పదార్థాలతో క్యాన్సర్



ఇటీవల కాలంలో చాలా మంది యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. అల్కాహాల్‌తో పాటుగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుకు అలవాటు పడి అనారోగ్యాల పాలవుతున్నారు. మత్తు పదార్థాలు ఎక్కువగా సేవించడం వల్ల పేగు క్యాన్సర్, లివర్ క్యాన్సర్, కిడ్నీలు పని చేయకపోవడం తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ మాధవీ కల్యాణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వున్న భక్తులు

శ్రీవారి సన్నిధిలో భక్తుల కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. దాదాపు 15వేలకు పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం నుంచి రద్దీ కాస్తతగ్గుముఖం పట్టింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వరాహావతారంలో జగన్నాథుడు



వరాహావతారంలో జగన్నాథుడు భక్తులకు ఆదివారం దర్శన భాగ్యాన్ని కల్పించారు. శ్రీజగన్నా థుని రథోత్సవాల్లో భాగంగా పురాతన లక్ష్మీపురం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జగన్నాథుడు రోజుకో అలంకరణలో సాక్షాత్కరిస్తున్నారు, సుభద్ర, బలభద్ర సమేతంగా కొలువై శంఖు చక్రాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తూ.. వరాహావతారంగా స్వామివారు భక్తులను అనుగ్రహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, జూన్ (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అటవీ ప్రాంతంలో కొలువైన వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు మొక్కులు తీర్చుకోవాలని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఏజెన్సీకి తరలి వస్తున్నారు. ఆలయానికి వెళ్లే రోడ్లు కిటకిటలాడాయి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

వారాహిదేవికి సరస్వతి అలంకరణ



పెనుమంట్ర, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : మల్లిపూడి గ్రామంలో వారాహిదేవి ఆలయంలో అమ్మవారి నవరాత్రులు పురస్కరించుకుని నాలుగోరోజు ఆదివారం సర్వసతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు వారణాశి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు పంచామృత అభిషేకాలు, సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. సరస్వతిదేవి అలంకరణలో ఉన్న వారాహిదేవికి విద్యార్థులు పూజలు నిర్వహించారు 5వ తేదీ వరకు నవరాత్రి పూజలు జరుగుతాయని గుడిమెట్ల సాయిబాబారెడ్డి తెలిపారు.

ఎంఈవోల వ్యవస్థలో 'ఇద్దరి' అవస్థలు !

» సమస్య పరిష్కారానికి వేర్వేరు ప్రతిపాదనలతో తలో వాదన » గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన చిచ్చు » ప్రభుత్వం దృష్టిసారిస్తేనే మేలు

ఏలూరు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలాల్లో ప్రభుత్వ విద్యాపథకాలు, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల విద్యాసామర్థ్యాల మదింపు తదితర కీలక కార్యకలాపాలకు ఉద్దేశించిన మండల విద్యాధికారుల(ఎంఈవో-1,2)వ్యవస్థలో నెలకొన్న సంస్థాగత సమస్యలపై రెండు రకాల ఎంఈవోల సంఘాలు ఆదివారం వేర్వేరుగా గళంవిప్పాయి. ఒకే పనికి ఇద్దరు సమానహోదాగల అధికారుల వల్ల క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టాయి. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థవల్ల ఏర్పడిన అసమానతలను తొలగించి వెంటనే బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ఎంఈవో-2ల సంఘం నాయకులు పట్టుబట్టగా, మండలానికి ఇద్దరు వద్దు...ఒక్కరే చాలునని పేర్కొంటూ ఎంఈవోలిద్దరినీ ఏకీకృతంచేసే ఫార్ములాను అమలు చేయడమే సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారమని ఎంఈవో-1ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ సమస్యలపై వేర్వేరు ప్రకటనల సారాంశమిదే.

అసమానతలు తొలగించి, బదిలీలు చేపట్టాలి : ఎంఈవో-2ల సంఘం

గత తొమ్మిదేళ్లగా ఒకేచోట పనిచేస్తున్న ఎంఈవోలకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని ఏపీ ఎంఈవో-2 సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పంచాయతీరాజ్ యాజమాన్యాలకు చెందిన హెచ్‌ఎంలతో మండలానికి ఇద్దరు చొప్పున నియామకాలు జరిగిన ఎంఈవోల వ్యవస్థలో భాగంగా మండల విద్యాధికారులను ఉమ్మడి సీనియార్టీ ద్వారా బదిలీ చేస్తారన్న ప్రచారంలో వాస్తవంలేదని ప్రభుత్వమే స్పష్టం చేయాలని కోరారు. ఇప్పటికే డీడీవోలుగా పనిచేసిన గ్రేడ్-2 హెచ్‌ఎంలను కన్వర్షన్‌ద్వారా ఎంఈవోలను నియమించగా, గత వైసీపీ ప్రభుత్వ వివక్షత కారణంగా ఎంఈవో-1ను డీడీవోగాను, ఎంఈవో-2ను నాన్ డీడీవోలుగా విభజించి సమాన హోదాకు దూరం చేసిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ మధ్య అసమానతలు సృష్టించిందని, దీనివల్ల ప్రజల్లో ఎంఈవో-2 అంటే చులకనభావం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏకీకృతంతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎంఈవో-1ల సంఘం

మండల స్థాయిలో వున్న తహసీల్దార్, ఎంపీడీవో, తదితర వ్యవస్థలు ఏ ఒక్క దానిలోనూ ఇద్దరు అధికారులు చొప్పున పర్యవేక్షణ లేదని, దానికననుగుణంగానే ఇద్దరు ఎంఈవోల వ్యవస్థను కూడా ఏకీకృతం చేసి మండలానికి ఒక్క ఎంఈవో మాత్రమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1ల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పలు అంశాలను వివరించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 679మంది చొప్పున ఎంఈవో-1, 2లు ఉన్నారని, ఈ రెండు పోస్టులను ఏకీకృతం చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆ ప్రకారం మొత్తం 679మంది ఎంఈవో-1 పోస్టుల్లో ప్రస్తుతం 400మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన ఖాళీల్లో ఎంఈవో-2లను భర్తీచేస్తే ఇంకా మిగిలిన వారు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా వెళ్లిపోవడానికి సుముఖంగావున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎంఈవోలను ఏకీకృతం చేయడం ఒక్కటే ఫార్ములా అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏకీకృత ఎంఈవో వ్యవస్థను పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

క్రైం సమాచారం

ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి..


» ఎనిమిది కాసుల బంగారు ఆభరణాల చోరీ



వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రవికుమార్

కైకలూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఆగంతుకుడు దాడి చేసి ఆభరణాలు దోచుకున్న ఘటన సంచలనం రేపింది. కైకలూరు మం డలం రామవరంలో శనివారం రాత్రి గ్రామానికి చెందిన గుడూరు నాగలక్ష్మి(62) భోజనం చేసి ఇంటి ఆరుబయల నిలబడింది. ఆగంతుకుడు వెనుక వైపు నుంచి వచ్చి తలకు ముసుగు వేసి దాడి చేశాడు. కేకలు వేయకుండా అడ్డుకుని ఆమె చేతికి ఉన్న రెండు బంగారు గాజులు, మెడలోని చైన్ మొత్తం 8 కాసుల ఆభరణాలను దొంగలించి పారిపోయాడు. కొద్దిసేపటికి ఆమె కోలుకుని ఇరుగు పొరుగు వారిని పిలిచి విషయం చెప్పగా కైకలూరు రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. నాగలక్ష్మికి ఒక కుమార్తె ఉండగా ఆమె చెన్నైలో ఉంటోంది. ఆమె ఒంటరిగా నివాసం ఉంటుందని గుర్తించి చోరీకి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, రూరల్ ఎస్ఐ వి.రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



చెక్కపల్లిలో బోల్తాకొట్టిన వాహనం

ముసునూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని చెక్కపల్లి ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన టాటాఏస్ వాహనం రమణక్కపేట వైపు వెళుతున్న క్రమంలో నూజివీడు మండలం నెహ్రూనగర్‌కు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు చెక్కపల్లి వైపు వస్తుండగా అతివేగంతో టాటాఏస్ వాహనం ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్న నలుగురు వ్యక్తులతోపాటు టాటా ఏస్ వాహనంలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో టాటా ఏస్ వాహనం పక్కకు పడిపోగా, రెండు బైక్‌లు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

సరిహద్దుల్లో పేకాట జోరు !

ఆంధ్ర, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా జూదం

కుక్కునూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో మళ్లీ పేకాట జోరుగా సాగుతుందనే ప్రచారం జరుగుతోంది. కుక్కునూరు మండలంలో వేలేరు శివారు గ్రామపంచాయతీలోని అటవీ ప్రాంతంలో రోజుకోకచోట పేకాట స్థావరం ఏర్పాటు చేసుకుని యదేచ్ఛగా పేకాట ఆడటం ఎప్పటి నుంచో ఉంది. పత్రికల్లో వార్తలు వచ్చినా, పోలీసులు నిఘా పెట్టిన సమయంలోనూ కొన్ని రోజుల పాటు పేకాటకు విరామం పలికి మళ్లీ కొనసాగించటం ఇక్కడ మామూలుగా జరుగుతూనే ఉంది. తెలంగాణకు చెందిన కొందరూ వ్యక్తులు ఈ ప్రాంతంలో పేకాటను నిర్వహిస్తుండగా అందుకు కొందరూ స్థానికులు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల మరలా పేకటా మొదలయ్యిందనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా తెలంగాణ లోని పలు ప్రాంతాలకు చెందిన జూదర్లు ఇక్కడ జరిగే పేకాటకు తరలివస్తు న్నారనే సమాచారం కుక్కునూరు మండల కేంద్రానికి దాదాపుగా 40 కిలో మీటర్ల దూరంలో ఈ పేకాట జరుగుతుండడంతో వారికి అవకాశంగా మారింది. పోలీసులకు పేకాట జరుగుతు న్నట్టు సమాచా రం అందించి అక్కడకు వెళ్లేలోపే జూదర్లు ఏర్పాటు చేసుకున్న నిఘాతో వెంటనే వారికి సమాచారం వెళ్లిపోతుంది. గతంలో ఇక్కడ భారీస్థాయిలో జరుగుతున్న పేకాట స్థావరం పై ఏలూరు నుంచి ప్రత్యేక స్క్వాడ్ బృందం వచ్చి దాడి జరిపారు. ఈ దాడిలో వేలాది రూపాయలు నగదు, వాహనాలు, పలువురు ప్రముఖులు పట్టుబడ్డారు. అయినప్పటికి ఈ శివారు ప్రాంతంలో పేకాట జరగడం నిత్యకృత్యమైంది. పోలీస్‌శాఖ నిఘా పెంచి దాడులు చేస్తేనే పేకాట నిర్వహణ నిలుస్తాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న జూదంలో వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు సమాచారం.

మొగల్తూరులో చోరీ

» మూడు కాసుల బంగారం, వెండి వస్తువులు అపహరణ

మొగల్తూరు, జూన్29(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు కోట వద్ద ఒక ఇంటిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరిం చిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. విద్యుత్ శాఖలో మొగల్తూరు ఎల్‌ఐగా పనిచేసి మృతి చెందిన ఏడీఎంఆర్ లూధరన్ బాబు మొగల్తూరు కోట వద్ద సొంతిల్లు నిర్మించుకున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి వెనుక భాగం నుంచి ప్రవేశించి సుమారు మూడు కాసుల బంగారు అభరణాలు, కిలో వెండి వస్తువులతో పాటు రూ.30వేలు నగదు దొంగలు అపహ రించినట్టు లూధరన్ బాబు సతీమణి అద్దంకి శేషారత్నం తెలిపారు. తన కుమారుడు ఆకివీడు పట్టణంలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేస్తుండడంతో వారానికి రెండురోజులు మాత్రమే కోట వద్ద నివాసంలో ఉంటున్నామన్నారు. ఆదివారం ఆమె ఫిర్యాదు మేరకు నరసాపురం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ నాగలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించి తనిఖీలు చేశారు. ఈ ఘటనపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మరో మూడు నెలల పొడిగింపు

నరసాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి):నరసాపురం బెంగళూరు మధ్య శుక్ర, శనివారాల్లో నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉత్వర్తులు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు ఈ నెలాఖరుకు ముగియనుంది. ప్రయాణికుల డిమాండ్ పరిగణనలోకి తీసుకుని మరో మూడు నెలలు పొడిగించారు. 07153 నంబర్‌తో నడిచే ఈ రైలు నరసాపురంలో ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరిగి అక్కడ 074154 నంబర్‌తో 10.50కి బయలుదేరి ఆదివారం ఉదయం 5 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.



ఖైదీలకు అందించే ఆహారాన్ని పరీక్షిస్తున్న శ్రీదేవి

'ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలి'

చింతలపూడి, జూన్ 29(ఆంధ్రజ్యోతి):జైలు ప్రాంగణంలో వున్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ఖైదీలు వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సూచించారు. ఆదివారం చింతలపూడిలోని సబ్‌జైల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో వచ్చేనెల 5న నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని పోలీసులకు సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు, న్యాయవాదులు టి.వెంకటేష్, పీఎల్‌రాజు, జైలు సూపరింటెండెంట్ కృపానందం, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న శేఖర్

జంగారెడ్డిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : చనిపోయిన అనాథ వృద్ధురాలికి సీతామహాలక్ష్మి అనాథ ఆశ్రమ నిర్వాహకుడు జయవరపు శేఖర్ అంత్యక్రియలు నిర్వహించాడు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోడూరి శకుంతల(94) లను వృద్ధాప్యంలో ఉందని పట్టించుకునేవారు లేరని నాలుగేళ్ల క్రితం స్థానిక సీతామహాలక్ష్మి అనాథ ఆశ్రమ నిర్వాహకుడు శేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారమందింది. అనారోగ్య సమస్యలున్న ఆ వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చుకుని ఆమెకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించాడు. చివరకు ఆ వృద్ధురాలు ఆదివారం మృతి చెందడంతో ఆమె దూరపు బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించాడు. ఆశ్రమ నిర్వాహకుడి సేవలను పలువురు కొనియాడారు.

హాయిగా ఆహ్లాదంగా..



పిప్పర, తాడేపల్లిగూడెం రహదారి మధ్యలో పచ్చని చెట్లు

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మొక్కలు నాటండి, వాటిని సంరక్షించండి అంటూ ప్రచారాలు చేస్తున్నాయి. ఇదే కోవలో గణపవరం మండలం పిప్పర, తాడేపల్లిగూడెం రహదారి నడుమ చిలకంపాడు గ్రామాల మధ్య ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం మొక్కలు నాటించింది. చిలకంపాడు గ్రామానికి చెందిన కొంతమంది బాధ్యత తీసుకుని మొక్కలను రక్షించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర అవి నేడు పెద్దవై రోడ్డు పక్కన ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు కార్లలో ప్రయాణించే వారు వాహనాలు ఆపి చెట్ల కింద భోజనాలు చేసి వెళ్తున్న ఘటనలు దర్శనమిస్తున్నాయి.

- గణపవరం

పెనుగొండ మానవత కార్యవర్గం

పెనుగొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుగొండ మండల శాఖ 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడుగా కొమ్ముల రామకృష్ణ, సెక్రటరీగా నూలి నవీన్ కుమార్, ట్రెజరర్‌గా యలమర్తి నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ మస్తాన్, జాయింట్ సెక్రటరీగా పలివెల శ్రీనివాస్, సభ్యులను ఎన్నుకున్నారు డైరెక్టర్స్ బోర్డ్ చైర్మన్‌గా నేమాని శ్రీనివాస్, కో-చైర్మన్‌గా బచ్చు లక్ష్మీ నరసింహ మూర్తి, కన్వీనర్‌గా నల్లిమిల్లి విజయరాజులను ఎన్నుకున్నారు.

దేవీ దర్శన యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం డిపో నుంచి ఒకరోజు ఆషాఢం దేవీ దర్శనం యాత్ర నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ డిపో మేనేజర్ తెలిపారు. జూలై 6న రూ. 500 టికెట్ ధరతో చింతలూరు నూకాలమ్మ, మట్లపాలెం మహాలక్ష్మీ, కాకినాడ వారాహి, పిఠాపురం పురూహూతిక, తాటిపర్తి అపర్ణా దేవి, పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ, కడియపులంక మునలమ్మ వారి దర్శనం ఉంటుందన్నారు. జూలై 6 ఉదయం 4 గంటలకు బస్సు బయలుదేరి సాయంత్రానికి తాడేపల్లిగూడెం డిపోకు చేరుకుంటుందన్నారు.

కోమటిగుంటలో వాకింగ్ ట్రాక్



కాళ్ళ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాళ్ళ మండలం కోమటిగుంటలో గ్రామ ప్రజలు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఒక ప్రత్యేక చెరువు తవ్వి, చుట్టూ ట్రాక్ ఏర్పాటు చేసి వాతావరణం ఆహ్లాదంగా ఉండేందుకు మొక్కలను కూడా నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి గ్రామ సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామంలో ఎక్కడా మురుగు లేకుండా, పంట కాలువలు కాలుష్యం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు వలవల బాబ్జి సత్కారం

పట్టణ టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

పెంటపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణ టీడీపీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. పరిశీలకులుగా నక్కా చిట్టిబాబు, చుక్కా సాయిబాబా హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. పట్టణ అధ్యక్షుడిగా పట్నాల రాంపండు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల శ్రీనివాస్, పట్టణ తెలుగుయువత అధ్యక్షుడిగా ఎరుబండి సతీష్ తదితరులు హాజరయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని బాబ్జి సత్కరించారు. టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, గొర్రెల శ్రీధర్, బండి పెద్దిరాజు, దాట్ల జగన్నాథరాజు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

భీమవరం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఇడుపులపాయ ప్రభుత్వ కళాశాలలో ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని సాయి హర్షిణిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు. పట్టణానికి చెందిన కారుమూరి సాయి హర్షిణి భీమవరం ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీటు సాధించింది. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, భూపతిరాజు సూర్యనారాయణ రాజు ఆకుల కృష్ణ, కారుమూరి సత్య నారాయణ మూర్తి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధానికి క్లాత్ సంచులు అందిస్తున్నామని శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం కాపు కళ్యాణ మండపం వద్ద సేవా సంఘ గౌరవాధ్యక్షుడు నంద్యాల కృష్ణమూర్తి సూచనలతో 2 వేల క్లాత్ బ్యాగులు మార్కెట్‌కు వచ్చిన వారికి సంచులు అందించారు. సంఘ కార్యదర్శి మూర్తి, కోశాధికారి సత్యనారాయణ, గందం వెంకట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 11 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్ష రెండు పరీక్షా కేంద్రాల్లో జరిగింది. మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష నిర్వహించారు. 210 మందికి 199 మంది హాజరై 11 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ళ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీసలి, కోమటిగుంట, సూర్యారావుపేట, చినపుల్లేరు, పెదపుల్లేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన అంగర



పాలకొల్లు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ కలిశారు. ఆదివారం సాయంత్రం ఆయన ఈవిషయాన్ని ఫోన్‌లో తెలిపారు. పార్టీ పరిస్థితులను, జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు తీరును వివరించినట్టు అంగర తెలిపారు.

సాహెబ్‌కు ఉద్యోగ విరమణ సత్కారం



ఆర్టీసీ అకౌంటెంట్ సాహెబ్ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

తణుకు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తణుకు ఆర్టీసీ డిపోలో అకౌంటెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన షేక్ చిన పెంటి సాహెబ్ మంచికి మారు పేరుగా విధి నిర్వహణలో సేవలందించారని పలువురు ఉద్యోగులు అన్నారు. ఆదివారం ఆర్టీసీ గ్యారేజిలో సాహెబ్ ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం సప్పా గిరిధర్ కుమార్, ఏవో ఎస్‌వీ రావు, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, యూనియన్ నాయకులు, పాల్గొన్నారు.

నిర్మాణ రంగం జోష్..

5వ పేజీ తరువాయి

ప్రభుత్వం సడలింపులు ఇచ్చింది. దీంతో పట్టణాల్లో స్తబ్ధతగా ఉన్న నిర్మాణ రంగానికి మంచి ఊపు కనిపిస్తుందని భావిస్తున్నారు.

సడలింపులు ఇలా..

- 60 గజాల స్థలంలో జీప్లస్ 1 నిర్మాణానికి ప్లాన్ ఇస్తారు. ముందు ఒక మీటరు సెట్ బ్యాక్ వదిలితే చాలు. అదేవిధంగా 120 గజాల స్థలంలో జీప్లస్ -2 నిర్మాణానికి 1 మీటరు సెట్ బ్యాక్ వదిలితే చాలు. గతంలో అరమీటరు వదలవలసి వచ్చేది.
- చిన్న సందుల్లో ఆరు అడుగులు రహదారి ఉన్నా ప్లాన్ ఇస్తారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. 120 గజాలు పైబడిన స్థలంలో సెట్ బ్యాక్ గతంలో 3.5 అడుగులు వదలాల్సివచ్చేది. ఇప్పుడు 2.5 అడుగులు వదిలితే చాలు.
- కమర్షియల్‌కు సంబంధించి 360 గజాల్లో కూడా సెల్లార్ పార్కింగ్‌తో నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. గతంలో 600 గజాలకు మాత్రమే అనుమతి ఉండేది. ఈ సడలింపు వల్ల చిన్న చిన్న స్థలాల్లో కూడా కమర్షియల్ నిర్మాణాలకు ఉపయోగకరంగా మారింది.
- అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి సెట్ బ్యాక్ విషయంలో యజమానులకు కొంత వెసులు బాటు ఇచ్చారు. సెట్ బ్యాక్ స్థలంలో ఐదు అడుగుల బాల్కనీ పెంచుకునేలా అవకాశం ఇచ్చారు.

సెట్ బ్యాక్‌లోనూ సడలింపు

- 120 గజాల నుంచి 600 గజాల వరకు సెట్ బ్యాక్ నిబంధనలు సడలించారు. 120 గజాల నుంచి 240 గజాల వరకు నిర్మాణానికి మూడు పక్కలా 2.5 అడుగులు వెడల్పు సెట్ బ్యాక్ ఉంటే చాలు. గతంలో 3.5 అడుగులు ఉండేది.
- 240 గజాల నుంచి 360 గజాల వరకు గతంలో 5 అడుగులు సెట్ బ్యాక్ వదలివలసి వచ్చేది. ఇప్పుడు 3.5 అడుగులు వదిలితే చాలు. 360 గజాల నుంచి 600 గజాల వరకు జీప్లస్-1 కు గతంలో 6.5 అడుగులు సెట్ బ్యాక్ ఉండేది. దీనిని 5 అడుగులకు తగ్గించారు. అలాగే జీప్లస్-3 భవనాలకు గతంలో 8.5 అడుగుల సెట్‌బ్యాక్ ఉండగా ఇప్పుడు 6.5 అడుగులకు తగ్గించారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం

కొనసాగుతున్న మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది ఆందోళన



దీక్ష చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది

నరసాపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పురపాలకంలో పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని సంఘం నాయకులు హెచ్చరించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏడోవ రోజు ఆదివారం సిబ్బంది దీక్ష కొనసాగించారు. వారం రోజులుగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యమిస్తున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఇదే విధానం అవలంభిస్తే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రత్నం, బత్తుల శ్రీను, కాశీ, సుజాత, సత్యనారాయణ, కిషోర్, మధు, కళ్యాణి, ఫణి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

నరసాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏడు రోజులుగా కాంట్రాక్టు సిబ్బంది సమ్మె చేస్తుండటంతో మునిసిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. తాగునీరు, వీధిలైట్ల సమస్య తలెత్తకుండా సచివాలయ సిబ్బందితో పాటు గతంలో వాటర్‌వర్క్సులో పని చేసిన సిబ్బందిని నియమించే పనిలో పడ్డారు. ఇప్పటికే వార్డుల వారీగా సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా పురపాలక సంఘంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో నీటి సరఫరా జరుగుతుంది. వీటికి సంబంధించి వార్డుల వారీగా నీటి విడుదలకు వాల్వ్ ఉంటాయి. వాటిని ఏ విధంగా ఆన్ ఆఫ్ చేయాలన్నదానిపై శిక్షణ ఇచ్చారు. గతంలో పని చేసి ప్రస్తుతం కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ సిబ్బంది కూడా ఈ విధుల్లో నియమించినట్లు కమిషనర్ అంజయ్య చెప్పారు. ఇక వీధిలైట్ల నిర్వహణలోనూ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రైవేట్ సిబ్బంది సహకారంతో సాయంత్రం సమయాల్లో వీధి లైట్లను ఆన్ చేయిస్తామన్నారు. తాగునీటిపై ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని కమిషనర్ అంజయ్య స్పష్టం చేశారు. అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఆర్‌ఎస్‌ఎస్ గురుపూజోత్సవం

పాలకొల్లు అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కోడిగట్టు సరస్వతి శిశుమందిరంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సామాజిక సమరత్ సంయోజక్ (తణుకు విభాగ్) సన్నిధి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ చేసుకునే గురుపూజోత్సవం విశిష్టమైనదని, భగధ్వజాన్ని (కాషాయం జెండా) గురువుగా ఆషాఢ శుద్ధ చవితి రోజును పురస్కరించుకుని ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పాలకొల్లు సంఘ సంచాలక్ కేవీఎస్‌ఎల్ నరసింహరాజు, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, బోడ సత్యజిత్ కుమార్, అప్పారి నాగరాజు, గాదె వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

కొమరవరంలో సీసీ రోడ్లు ప్రారంభం

తణుకు రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కొమరవరం లక్ష్మీ గణపతి నగర్‌లో రూ. 37 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన, కొమరవరంలో ఉపాధి నిధులు రూ. 15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు చిక్కాల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులను నియంత్రించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని, యూనిఫారాలు, బూట్లు, పుస్తకాలు ప్రైవేటు విద్యాసంస్థలు విక్రయించరాదని తెలిపారు. ప్రభుత్వ జీవోలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చంద్ర ప్రసాద్, మామిడిశెట్టి చిట్టిబాబు, గుబ్బల వెంకన్నబాబు, నక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధం

తాడేపల్లిగూడెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరపణలపై చర్చకు తామంతా సిద్ధంగా ఉన్నామని జనసేన నాయకులు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన నాయకులు అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇటీవల మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తమ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌పైన తమపైన ఆరోపణలు చేస్తున్నారని ఎక్కడ చర్చపెట్టినా ఎవరు అవినీతికి పాల్పడ్డారో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చర్చ ఎక్కడ పెట్టినా వస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వర్తనపల్లి కాశీ, నీలపాల దినేష్, కట్టుబోయిన ప్రసాద్, అడబాల నారాయణమూర్తి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : భీమవరం లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఆకుల శేషసాయి నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా బోండా రాంబాబు, సెక్రటరీ అల్లు తులసి ప్రసాద్, కోశాధికారి కనగర్ల రామకృష్ణ, జోన్ చైర్మన్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, కో ఆర్డినేటర్ పేరిచర్ల మూర్తిరాజు, వైస్ ప్రెసిడెంట్ వీఎస్ నాగేశ్వరరావు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ నందమూరి రాజేష్, సర్వీస్ చైర్మన్ సరోజని మహ్మద్, మార్కెటింగ్ చైర్మన్ నారేడిమిల్లి మహేష్ కుమార్, పేరిచర్ల కృష్ణంరాజులు ప్రమాణ స్వీకారం చేశారు.

వృద్ధాశ్రమంలో భోజనాలు వితరణ

గణపవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి అన్నారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం సచ్చితానంద వెంకటేశ్వర అవధూత సాయి వృద్ధాశ్రమంలో భోజనం, నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, అధ్యాపకులు, జి.వెంకటరమణ, శ్రీనివాసరావు, పర్వీన్ అన్సారీ పాల్గొన్నారు.

ఎంఆర్ రాజు మృతి తీరని లోటు

కాళ్ళ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎంతో మంది పేదలకు ఉచితంగా వైద్యం అందించిన మహనీయుడు ఎం.ఆర్. రాజు మృతి తీరని లోటని టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. ఆదివారం పెద అమిరం మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ భవనంలో ఎం.ఆర్. రాజు చిత్రపటానికి బాపిరాజు దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కిరాణా అసోసియేషన్ కార్యవర్గం

గణపవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):గణపవరం మండల కిరాణా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గణపవరంలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బైరబోయిన మాల్యాద్రియాదవ్, ప్రధాన కార్యదర్శిగా చేగు సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా జువ్వల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షునిగా కొల్లూరి బాల, పెనుగంటి రాములను కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

బాధితులకు బాసటగా కూటమి ప్రభుత్వం

తాడేపల్లిగూడెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాధితులకు బాసటగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 15వ వార్డుకు చెందిన సమయం జయ విష్ణుకు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం వారి కుటుంబ సభ్యులు 15రోజుల కిందట తనను కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం సహాయనిధి నుంచి 2.5లక్షల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేయించామన్నారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు అనుపత్రాన్ని ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి అడబాల రామారావు, జనసేన నాయకులు వర్తనపల్లి కాశీ, పుల్లా బాబి, అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

నరసాపురం రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో మహిళా సర్పంచ్‌లకు డివిజన్‌స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. మహిళా సాధికారిత, సుపరిపాలన సాధ్యం అనే అంశంపై ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌లు మహిళ సర్పంచ్‌లకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆషాఢ మాసం మొదటి ఆదివారం కావడంతో ఆలయం వద్ద భక్తులు, మోటారు సైకిళ్ళతో కిక్కిరిసిపోయింది. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కళాకారులు బాగుంటే సమాజం సుభిక్షం

తాడేపల్లిగూడెం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కళాకారులు బాగుంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. సూరంపూడి వెంకటరమణ అధ్యక్షతన రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ సంఘం 45 ఏళ్లుగా కళాకారులకు విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. అనంతరం డి.శ్రీనాథ్‌రత్న శిల్పి ఉడయార్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె దేవికారాణి ఉడయార్ సహకారంతో పేద కళాకారులకు దుప్పట్లు అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, సాయివెన్నెల ఆస్పత్రి వైద్యులు బి. లీలారాణి, బి. చిన్నికృష్ణ ప్రసంగించారు. అనంతరం పేద కళాకారులకు ఆర్థిక సత్కారం చేశారు.

పూర్తి స్థాయి సరుకులను అందజేయాలి

పెంటపాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల ద్వారా పూర్తి స్థాయి సరుకులను అందజేయాలని సీపీఎం నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వ రరావు డిమాండ్ చేశారు. పెంటపాడులో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో రేషన్ షాపుల నుండి 14 రకాల సరుకులను అందజేసేవారని, అదే పద్ధతిని ఇప్పుడు కూడా కొనసాగించా లన్నారు. బర్ల బాలాజీ, పెన గంటి దుర్గ, మీసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బండి ముత్యాలమ్మకు విశ్రాంత డీసీపీ పూజలు

మొగల్తూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారిని ఆదివారం విజయవాడ రిటైర్డ్ డీసీపీ డాక్టర్ టి.హరికృష్ణ పద్మరాణి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈసందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ పోలీస్ శాఖలో 1989లో ఎస్ఐగా చేరిన తాను వివిధ హోదాల్లో పని చేసి డీసీపీగా పదవి విరమణ చేశానన్నారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘానికి కార్యదర్శిగా పని చేస్తున్నట్టు తెలిపారు. బండి ముత్యాలమ్మ అమ్మవారు తమ కుటుంబానికి ఇలవేల్పు అని జాతర సమయంలో రాలేని కారణంగా ప్రత్యేకంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్టు తెలిపారు.

నేడు టీడీపీ శ్రేణుల సమావేశం

నరసాపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కన్వర్లు, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు.